
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 17 నవంబరు 2025
5

సామినేని హత్యకేసును
పోలీసులు పక్కదోవ పట్టిస్తున్నారు
సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని
6

42 శాతం రిజర్వేషన్లతోనే
స్థానిక ఎన్నికలు జరపాలి
మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తాతా మధు



గోదారమ్మా.. హారతి గొనుమా

- వేదమంత్రాల మధ్య పంచ హారతుల సమర్పణ
- శ్రీరామ పాదుకులకు అష్టోత్తర శతనామార్చన

భద్రాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏటా కార్తీక బహుళ ద్వాదశి రోజున నిర్వహించే పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని ఆదివారం భద్రాచలం వద్ద పవిత్ర గోదావరి నదీ తీరంలో నిర్వహించారు. ముందుగా శ్రీరామ పాదుకులను పల్లకిలో వేంచేసి మేళతాళాలు, భాజభజంత్రీలు, కోలాటాల మధ్య గౌతమీ తీరానికి తీసుకువచ్చారు. ఈ సమయంలో పుణ్యనదీ హారతికి వేద పండితులు అర్చక స్వాములు శ్రీకారం చుట్టి సంకల్పంతో ఈ కార్యక్రమానికి నాంది పలికారు. అలాగే గోదావరి తల్లికి విశేష అర్చన, పసుపు, కుంకుమ, వస్త్రాలను సమర్పించారు. శ్రీరామపాదుకులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీరామపాదుకార్చన, మంగళహారతి, దీప స్తంభ తదితర పంచ హారతులను ముందుగా భద్రాద్రికి సమర్పించి ఆ తరువాత పరమ పవిత్రమైన గోదావరి నదికి హారతులను సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవో శ్రావణ్ కుమార్, భవానీరామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అర్చకులు అమరవాది కిషోర్‌కుమారాచార్యులు, వేద పండితులు వేనూతుల ఆంజనేయ వరప్రసాద్ శర్మ, రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

వనమంతా జనం..

- జిల్లాలో పలు చోట్ల ఉత్సాహంగా వనసమారాధనలు
- ఖమ్మంలో కమ్మమహాజనుల కార్యక్రమానికి హాజరైన మంత్రి తుమ్మల
- సత్తుపల్లిలో రెడ్డి, ఆర్యవైశ్యుల వనభోజనాలకు హాజరైన మంత్రి పొంగులేటి



ఖమ్మం కమ్మ వారి వన సమారాధనలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురం హవేలి / సత్తుపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస చివరి ఆదివారం కావడంతో జిల్లా వ్యాప్తంగా పలు కులసంఘాల ఆధ్వర్యంలో వనసమారాధానలను ఉత్సాహంగా నిర్వహించారు. దీంతో వనాలన్నీ జనంతో నిండిపోయాయి. పలు చోట్ల జరిగిన వనసమారాధన మహోత్సవాలకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఆయా కులసంఘాల ప్రతినిధులు, వ్యాపార, ఇతర రంగాల ప్రముఖులు హాజరయ్యారు. ఖమ్మంలోని చెరుకూరి మామిడితోటలో జరిగిన కమ్మమహాజనసంఘం వనసమారాధనలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి రామనాథం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, తుమ్మల యుగంధర్ తదితరులు హాజరయ్యారు. వనసమారాధనలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన రుద్రాభిషేకం, దీపారాధన, వనపూజలు పాల్గొన్న



సత్తుపల్లిలో మంత్రి పొంగులేటిని సన్మానిస్తున్న రెడ్డి కమిటీ సభ్యులు

(మిగతా 8వ పేజీలో)

గ్రీన్ ఫీల్డ్ హైవేను
సంక్రాంతి నాటికి
పూర్తిచేస్తాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



7

పేదల ప్రభుత్వంలో సకల వర్గాలకు న్యాయం

- పునాదుల్లోనే దర్శనమిస్తున్న గత ప్రభుత్వ ఇళ్లు
- 'కారు'కూతలకు జూబ్లీహిల్స్ ఫలితమే సమాధానం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఇల్లెందుటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదవాడి దీవెనలతో ఏర్పడిన ఇందిరమ్మ ప్రభుత్వంలో సకలవర్గాలకు న్యాయం చేకూర్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లెందు మునిసిపాలిటీలోని వివిధ వార్డుల్లో రూ.15కోట్లతో చేపట్టిన రహదారులు, బ్రిడ్జీల నిర్మాణపనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఎస్టీ లబ్ధిదారులు 243మందికి మంజూరు పత్రాలను అందించారు. ప్రభుత్వ వైద్యశాలలో బ్లడ్‌స్టోరేజీ కేంద్రాన్ని ప్రారంబించారు. వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం కనీసం చిన్న ఇల్లు ఇవ్వలేని జ్ఞానంతో పనిచేసిందని విమర్శించారు. రాష్ట్రంలో 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని పేదలు నిండు మనసుతో ఇళ్ల నిర్మాణాలు సాగిస్తున్నారని హర్షం వెలిబుచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు రూ.25,500కోట్లను కేటాయించినట్లు ప్రకటించారు. మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు కోటిమందిని ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 18 లక్షల మందిని రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేర్చామని తెలిపారు. అడిగిన ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నామని, పేదలకు అండగా ప్రభుత్వం ఎంతో గుండెధైర్యాన్ని అందించడం ద్వారా పేదలకు భరోసా కల్పిస్తున్నామని వివరించారు. రైతులకు రూ.9వేల కోట్లను రుణమాఫీ ద్వారా అందించామని వెల్లడించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై కొంతమంది కారుకూతలు కూస్తున్నారని వారికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితాలు సమాధానం చెప్పాయని వివరించారు. మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలకు మరింతగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లు అసంపూర్ణంగా ఉన్నాయని లబ్ధిదారులకు బిల్లులు చెల్లించకుండా అధికారులు కాజేశారని ఆరోపించారు. గతంలో మంజూరైన వారికి ప్రస్తుతం ఇళ్లు (మిగతా 6వ పేజీలో)

మిషన్లు.. మొరాయిస్తున్నాయి!

- టీ హబ్‌లో తరచూ వైద్య పరీక్షలకు అంతరాయం
- కాలం తీరిపోయిన కోటిన్నర విలువైన పరికరాలు
- తిరిగి ఏర్పాటు చేస్తేనే తిప్పలు తప్పేది

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 6,52,571 మంది రోగులు.. 12,24,833 శాంపిళ్లు, 1.19కోట్లకుపైగా ఫలితాలు..! ఇవీ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని తెలంగాణ హబ్‌లో (టీహబ్) ద్వారా రోగులకు నిర్వహించిన పరీక్షల లెక్కలు. 2021లో ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు లక్షలమంది రోగులకు సేవలందాయి. గతంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు వైద్య పరీక్షలను నిర్వహించాలంటే బయటి డయాగ్నస్టిక్ సెంటర్లకు రిఫర్ చేయాల్సి వచ్చేది. అది పేదలకు భారంగా మారేది. ఈ క్రమంలో ప్రభుత్వం సర్కారీ దవాఖానాల్లోనూ మెరుగైన, నాణ్యమైన వైద్య పరీక్షలను నిర్వహించేందుకు వీలుగా తెలంగాణ హబ్ పేరుతో డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కోటిన్నర విలువైన పరికరాలు.. అదీ కార్పోరేట్ ఆస్పత్రుల్లో ఉండే ఫుల్లీ ఆటోమేటిక్ యంత్రాలను సమకూర్చి నిరుపేదలకు ఒక్క పైసా ఖర్చు కాకుండా 127రకాల వైద్య పరీక్షలను నిర్వహించే సదుపాయాలను కల్పించింది. 2021 జూన్9న ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో అప్పటి ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అప్పటి నుంచి ఈ ఏడాది నవంబరు 13 నాటికి 24,72,064 పరీక్షలను నిర్వహించారు.

టీహబ్‌లో రక్త, మూత్రం, కిడ్నీ, లివర్, కాన్సర్, థైరాయిడ్, హార్మోన్ అనలైజర్, హార్మోన్ల మోతాదు, షుగర్, బ్లడ్ యూరియా, సిరంక్రియాటిమిన్, లివర్, కొలెస్ట్రాల్, కీళ్లవాతం, బ్లడ్ ఇన్‌పెక్షన్, సీబీపీ, రక్తకణాల పరిస్థితి, రక్తహీనత, హిమోగ్లోబిన్‌శాతం, ఇన్‌పెక్షన్, డబ్ల్యూబీసీ కౌంట్, ఆర్‌బీసీ, ఎర్రరక్తకణాల స్థితిగతులు లాంటి 127రకాల పరీక్షలను నిర్వహిస్తున్నారు. కోటిన్నర విలువైన ఫుల్లీ ఆటోమేటిక్ బయోకెమిస్ట్ అనలైజింగ్, ఆటోమేటిక్ హెమటాలజీ మిషన్, ఆటోమేటిక్ యూరిన్ అనలైజింగ్, హార్మోన్ ఎనలైజింగ్ మిషన్లను సిద్ధం చేశారు. వీటిలో బయోకెమిస్ట్ విభాగంలో 36 పరీక్షలను, పాథాలజీ విభాగంలో 14పరీక్షలను, మైక్రోబయాలజీ విభాగంలో 8పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఇవన్నీ రోగులకు ఉచితంగా నిర్వహించడంతో పాటు జిల్లాలోని 26పీహెచ్‌సీలు, 4 యూపీహెచ్‌సీలు, బస్తీదవాఖానాలు, 9సీహెచ్‌సీలు ఇలా మొత్తం 60 కేంద్రాల నుంచి రక్తనమూనాలు వాహనాల్లో తీసుకొస్తే ఇక్కడి సిబ్బంది పరీక్షలు నిర్వహించి నేరుగా రోగుల సెల్‌నెంబరుకు మెసేజ్‌ల రూపంలో ఫలితాలను పంపిస్తున్నారు. ఇది రోగనిర్ధారణకు (మిగతా 8వ పేజీలో)

ఐదేళ్లుగా టీహబ్‌లో నిర్వహించిన పరీక్షలు ఇలా..

సంవత్సరం	రోగులు	శాంపిల్స్	పరీక్షలు
2021	26529	54090	565519
2022	82860	169044	1795276
2023	167615	341367	3298011
2024	216309	391415	3796025
2025-11-13	159258	268917	2472064
మొత్తం	6,52,571	12,24,833	1,19,26,895



జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్

నేడు 'జాగృతి జనం బాట' ప్రారంభం

- మధిర చేరుకున్న కల్వకుంట్ల కవిత
- జమలాపురం శ్రీవారికి పూజల అనంతరం పర్యటన
- ప్రజల ఇబ్బందులు తెలుసుకునేందుకేనని వెల్లడి
- శాతవాహన రైలు జనరల్ బోగీలో ఐదుగంటల ప్రయాణం

మధిరరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): 'జాగృతి జనం బాట' పేరుతో ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ చూపేలా తెలంగాణ జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. సోమ, మంగళవారాల్లో మధిర, సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో పర్యటించనున్న ఆమె హైదరాబాద్ నుంచి శాతవాహన రైలులో ఆదివారం రాత్రి మధిర చేరుకున్నారు. ఐదుగంటల పాటు జనరల్ బోగీలో ప్రయాణించిన కవిత ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలు, స్థితిగతులు తెలుసుకున్నారు. మధిర రైల్వేస్టేషన్‌లో దిగగా.. తొలిసారి మధిరకు వచ్చిన ఆమెకు తెలంగాణ జాగృతి కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అక్కడ విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా జాగృతి కృషిచేస్తుందని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు (మిగతా 6వ పేజీలో)



విలేకరులతో మాట్లాడుతున్న కవిత

జాబ్‌మేళాతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు

- ఎమ్మెల్యే కూనంనేని, సింగరేణి సీఎండీ బలరాం
- కొత్తగూడెంలో ఉత్సాహంగా జాబ్‌మేళా
- 8వేల మందికిపైగా నిరుద్యోగుల హాజరు
- ఇంటర్వ్యూలు నిర్వహించిన 71 సంస్థలు

కొత్తగూడెం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జాబ్‌మేళాలతో నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నిండుతాయని, ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సింగరేణి సీఎండీ బలరాం పేర్కొన్నారు. ప్రతీ యువకునికి ఉద్యోగ అవకాశం కల్పించడమే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 71కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా 8వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకుసాగుతున్నామన్నారు. జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కంపెనీలను కొత్తగూడేనికి రప్పించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యావంతులైన నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ప్రైవేట్ రంగంలో రాణించేందుకు ఉద్యోగంలో చేరాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సింగరేణి డైరెక్టర్ పా గౌతమ్ పోట్రు, డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, జీఎంలు షాలెం రాజు, కిరణ్ కుమార్, చింతల శ్రీనివాస్, చెందా లక్ష్మీనారాయణ, ఆర్డీఓ మధు, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, మున్సిపల్ కమిషనర్ సుజాత, తహసీల్దార్ పుల్లయ్య పాల్గొన్నారు.



జాబ్‌మేళాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సీఎండీ, ఎస్పీ,



హాజరైన నిరుద్యోగులు

ఉపాధి కల్పించడమే లక్ష్యం

బలరాం, సింగరేణి సీఎండీ

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం కృషి చేస్తోందని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. సింగరేణి కోల్‌బెల్ట్ అన్ని ఏరియాల్లో జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలన్నింటిలో ఉద్యోగాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామని , ఇందులో భాగంగా కొత్తగూడేనికి 71 కంపెనీలను తీసుకొచ్చామని, నిరుద్యోగులు పెద్ద ఎత్తున హాజరైనప్పటికీ సుమారు మూడు వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. యువత ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు జరపాలి

» మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ తాతా మధు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం మార్కెట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చట్టబద్ధతతో కూడిన 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, ఎమ్మెల్సీ తాతా మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి సభలో ఇచ్చిన ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాలని అన్నారు. బీసీ రిజర్వేషన్లలో కాని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ. 2,500 సాయం, కళ్యాణలక్ష్మి పథకం ద్వారా తులం బంగారం విషయంలో కాని జిమ్మిక్కులు చేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నాటి ఎన్టీఆర్ పాలన గురించి ఆయన ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల గురించి ఇప్పటికీ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని పాలన అంటే అలా చేయాలని గుర్తు చేశారు. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు తమ బీఆర్ఎస్ పార్టీ కట్టుబడిందని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే ప్రయోజనం ఏమైనా ఉందా అని నిలదీశారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ఇలా అధ్వాన్నంగా తయారవుతుందని అనుకోలేదని విమర్శించారు. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల విషయంలో అన్యాయం చేయాలని చూస్తే రాష్ట్రం అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో గెలిచాము అని పొంగి పోతున్నారని బలుపును చూసి వాపు అనుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, బిచ్చాల తిరుమలరావు, అమరగాని వెంకన్న, ఉప్పల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

‘వరి’ వడిగా...

» పలు చోట్ల వరి కోతలు ప్రారంభం
» యంత్రాలకు పెరిగిన డిమాండ్
» పలు మండలాల్లో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు



మోరంపల్లిబంజరలో వరి కోస్తున్న దృశ్యం

బూర్గంపాడు / కరకగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు వడివడిగా సాగుతున్నాయి. భద్రాద్రి జిల్లాలో పలు చోట్ల వరి కోతలు ప్రారంభం కాగా.. బూర్గంపాడు, కరకగూడెంతో పాటు పలు మండలాల్లో విస్తృతంగా జరగుతున్నాయి. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, తదితర ప్రాంతాల నుంచి వరికోత మిషన్లు పదుల సంఖ్యలో గ్రామాలకు చేరుకున్నాయి. అయితే వరికోతలు ముమ్మరం కావడంతో గంటకు రూ.2000 ఉండగా రూ.200నుంచి రూ.300వరకు ధరలు పెంచినట్టు రైతులు, మిషన్ యాజమానులు పేర్కొంటున్నారు. ట్రాక్ మిషన్లు అయితే గంటకు రూ.3వేలనుంచి రూ.3500 వరకు డిమాండ్ ఉంది.

ధాన్యం అమ్మకాలకు ఇబ్బందులు

కోతలు ముమ్మరమైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు మండలంలో ఎక్కడా ప్రారంభమవకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. రైతులువడ్లను ఆరబెట్టి ఎదురుచూస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. సొసైటీ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండల పరిధిలోని బూర్గంపాడు మోరంపల్లిబంజర, సోంపల్లి, లక్ష్మీపురం, నాగినేనిప్రోలు గ్రామాలలో కొనుగోలకేంద్రాలు ప్రారంభిచాల్సి ఉండగా ఇప్పటికి ప్రారంభం చేయకపోవడంతో రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. ఇదే అదునుగా దళారులు బేరసారాలు మొదలు పెడుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు ప్రభుత్వ మద్దతు ధర దక్కే అవకాశం ఉందని దానికి తోడు క్వింటాకు రూ. 500బోనస్ అందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. దళారులు కేవలం రూ.1600 నుంచి రూ.1800వరకే అడుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు.



కరకగూడెంలో ధాన్యం విక్రయించేందుకు ఆర పోసిన రైతులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

● నరసింహరెడ్డి, యువరైతు, మోరంపల్లిబంజర

అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి. మండలంలో ఇప్పటికే వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. మా పొలంలో వరి కోపించి వారం రోజులు అవుతుంది. రైతులు ధాన్యం అరబెట్టుకుంటున్నారు. ఇప్పటికే కేంద్రాలు ప్రారంభం కాకపోయిన రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కేంద్రాల వద్దకు తరలించి అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. కేంద్రాలు ప్రారంభం ఆలస్యం అయితే రైతులు దళారులకు అమ్ముకుని నష్టపోయే ప్రమాదం ఉంది.

రేపు మణుగూరులో టీబీజీకేఎస్ రాష్ట్ర సమావేశం

మణుగూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులోని పీవీ కాలనీలో గల టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు మణుగూరు ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వెంకట్ ఆదివారం తెలిపారు. ఈ సమావేశం టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు.

సింగరేణి వ్యాప్తంగా ఉన్న సెంట్రల్ కమిటీ, బ్రాంచ్ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కానున్నారని చెప్పారు. సింగరేణి స్థితి గతులు సంస్థ పరిరక్షణ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో చర్చించి భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించనున్నాట్లు పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇబ్రాయిల్, రామాచారి, మునిగెల నాగేశ్వరరావు, మురళీకృష్ణ, మస్తాన్, పవన్ కుమార్, శ్రీనివాస్, సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పీడీఎస్‌యూ భద్రాద్రి జిల్లా మహాసభ

మణుగూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మణుగూరు పట్టణంలోని కిన్నెర కల్యాణ మండపంలో పీడీఎస్‌యూ జిల్లా మహాసభను సోమవారం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మునిగెల శివ ప్రశాంత్ ఆదివారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు మధుసూధన్‌రెడ్డి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం పాల్గొంటారని తెలిపారు. నిర్వహించే ఈ మహాసభను విజయవంతం చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

కర్ణాటకలో వైభవంగా రామయ్య కల్యాణం

భద్రాచలం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని టుముకూరులో భద్రాద్రి రామయ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. రెండు రోజుల క్రితం స్థానికుల ఆహ్వానం మేరకు శ్రీరామ ప్రచార రథంతో వైదిక పరిపాలన సిబ్బంది తరలివెళ్లారు. ఈ క్రమంలో శనివారం శోభయాత్ర నిర్వహించగా ఆదివారం కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణదారణ, యజ్ఞోపవీత ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంతో కల్యాణ ప్రక్రియ ముగిసింది. ఈసమయంలో భద్రాద్రి ప్రాశస్త్యంను, సీతా రాముల కల్యాణ వైభవంను దేవస్థానం వైదిక సిబ్బంది వివరించారు. కాగా ఈ కల్యాణాన్ని పురస్కరించుకొని రూ.42 వేలు కట్నాలు, విరాళాల రూపంలో వచ్చినట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రామయ్యను దర్శించుకున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

భద్రాద్రి రామయ్యను ఆదివారం మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్దంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ సమయంలో ఎంపీకి కండువ, స్వామి వారి ప్రసాదాన్ని దేవస్థానం ఈవో దామోదర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్ కుమార్, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం మూలవరులకు అర్జిత సేవల్లో భాగంగా పంచామృతాభిషేకం, సువర్ణ పుష్పార్చన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణాన్ని సైతం సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఇదిలా ఉండగా కార్తీకమాసాన్ని పురస్కరించుకొని చిత్రకూట మండపంలో సత్యదేవుని వ్రతాలను సంప్రదాయబద్దంగా నిర్వహించారు.



టుముకూరులో సీతారామచంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సాహిత్యం ప్రజాస్వామీకరించబడాలి

» ప్రొఫెసర్ జయదీర్ తిరుమలరావు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాహిత్యం ప్రజాస్వామీకరించబడాలని, వర్గ దృక్పథంతో చరిత్రను స్థిరీకరణ చేయాలని ప్రఖ్యాత సాహితీ వేత్త ప్రొఫెసర్ జయదీర్ తిరుమలరావు అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాలులో జరిగిన ఎస్.తిర్మల్ స్వీయ కవితా సంపుటి "మట్టి పువ్వు"పుస్తకం ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ సాహిత్యం సామాజిక వాస్తవికతను, సమతుల్యతను వ్యక్తం చేయాలని అన్నారు. స్వీయ జీవిత వచనంలో రాయడం అవసరమని అన్నారు. పాటక వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని రాయాలని అన్నారు. రచయిత ప్రతి అక్షరం సమాజానికి ఉపయోగపడేలా పుస్తకాలు ఉండాలన్నారు. ప్రజాస్వామీకరించిన రచయిత స్వీయ చరిత్ర రాయకపోతే చరిత్ర కూడా వక్రీకరించబడే అవకాశం ఉందని అన్నారు. తర్జమా అంటే భాష వ్యక్తీకరణ మాత్రమే కాదు బాషను ప్రజలుకు చేరవేసే పనితనం రచయిత కుండాలన్నారు. మట్టిపువ్వు స్వీయ వచన సంపుటి తిర్మల్ కాలం నుంచి ప్రయోగాత్మక స్వీయ నిజ చరిత్రగా నిలబడుతుంది అన్నారు. సెల్ ఫోను, ఫేస్ బుక్ లే వ్యాపకం అయిన చోట రచయితల పాత్ర అవసరం సమాజానికి చాలా ఉందన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ తిర్మల్ ఉద్యమాల నుంచి ఎదిగిన కవి, రచయిత, ఆయన సామాజిక ఉద్యమాల నుంచి పుట్టిన రచయిత అని అన్నారు. ప్రముఖ కవి మువ్వా శ్రీనివాసరావు మాట్లాడుతూ తిర్మల్ మట్టిపువ్వు ఓ సామాజిక లక్ష్యం తో రాశారని, అందులో ఆయన చరిత్ర కంటే ప్రజలు అందరి చరిత్రగా రచన కనపడుతుంది అన్నారు. ప్రజా రచయిత జీవన్ మాట్లాడుతూ సామాజిక దర్పణంగా మట్టి పువ్వు నిలబడుతుందని అన్నారు. ప్రముఖ రచయిత హనీఫ్ అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో ప్రొఫెసర్ గూడూరి మనోజా, ప్రముఖ కవి డాక్టర్ దిలావర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత అవునూరి మధు, సాహితీ స్రవంతి మాజీ కన్వీనర్ కపిల రాంకుమార్, వికాస వేదిక జిల్లా కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, రచయిత సీహెచ్.ఆంజనేయులు, తదితరులు హాజరై మాట్లాడారు. సభకు ముందు ఇటీవల మృతి చెందిన కవి అందెశ్రీ, ఉపాధ్యాయ నేత కె.నారాయణ లకు సమావేశం రెండు నిముషాలు మౌనం పాటించింది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

పేదల ప్రభుత్వంలో సకలవర్గాలకు న్యాయం

(5వ పేజీ తరువాయి)

వచ్చే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా మిగిలిపోయిన వారికి కూడా ఇళ్ల మంజూరు చేసే విధంగా మంత్రి శ్రీనివాసరెడ్డి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు, కొత్తగూడెం ఆర్డీవో మధుసూధన్, హౌసింగ్ బోర్డు పీడీ రవీంద్రనాద్, ఎంపీడీవో ధన్‌సింగ్, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, డీఈ మురళి తదతరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలపై ఫిర్యాదులు ఉన్నాయ్

ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులతో సమీక్షలో పేద రోగులకు నిత్యం అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యశాలలో రోగులకు అందుతున్న సేవలపై పూర్తిస్థాయిలో సంపూర్ణమైన సమాచారం ఉందని ఇప్పటి వరకు పనితీరు బాగానే ఉన్నప్పటికీ ఇంకా మెరుగుపరుచుకోవాలని వైద్యసిబ్బందిని హెచ్చరించారు. ఏజెన్సీ కేంద్రంలో గల వైద్యశాలో పేద రోగులకు మందులు ఇతర సౌకర్యాలు అందడంలో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లుగా తన దృష్టికి వచ్చిందని వైద్యశాలపై ఫిర్యాదులు పునరావృతం కావొద్దని వైద్యులకు సూచనలు చేశారు. మందులను బయటకు రాస్తున్నారా అని ప్రశ్నించారు. వైద్యశాల పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

నేడు 'జాగృతి జనం బాట' ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

చేయటం జాగృతికి కొత్తకాదని, ఇటీవల నల్లగొండ జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై జాగృతి ఆధ్వర్యంలో జనం బాట కార్యక్రమం నిర్వహించామన్నారు. తాము ఆ జిల్లా ప్రజల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా పలు సమస్యలను పరిష్కరించారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఖమ్మం జిల్లా పర్యటనకు వచ్చానన్నారు. అనంతరం ఓ ప్రైవేట్ విశ్రాంతి భవనంలో బసచేశారు. ఇక జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా కల్వకుంట్ల కవిత సోమవారం ఉదయం మధిర నియోజకవర్గంలోని ఎర్రుపాలెం మండలం జమలాపురం వెళ్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అనంతరం మధిర పట్టణంతో పాటు సత్తుపల్లి, వైరా, ఖమ్మం నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు.

సామినేని హత్యకేసును పోలీసులు పక్కదోవ పట్టిస్తున్నారు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని

ఖమ్మంఅర్బన్ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన సీపీఎం రాష్ట్ర రైతుసంఘం నేత సామినేని రామారావు హత్యకేసును పక్కదోవ పట్టించే విధంగా పోలీసుల విచారణ సాగుతోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఒత్తిడి మేరకు పోలీసులు విచారణలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. హత్య జరిగి పదిహేడు రోజులు గడిచినా ఇంత వరకు హంతకులను గుర్తించక పోవటం అరెస్టు చేయక పోగా సీపీఎం నేతలను, సామినేని రామారావు కుటుంబ సభ్యులను అనుమానిస్తుండటం బాధాకరం అన్నారు. హంతకులు గ్రామానికి చెందిన ఫలానావారు అని రామారావు భార్య స్వరాజ్యం చెప్పినప్పటికీ పోలీసులు అనవసర విచారణలతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. పార్టీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిని సైతం స్టేషన్లకు విచారణ రావాలని ఆదేశిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. దోషులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న కాంగ్రెస్, బీజేపీ యేతర పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని ప్రజాస్వామ్యవాదులతో కలిసి పోలీస్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తామన్నారు. ఈసమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీసభ్యులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు మాదినేని రమేష్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

కథాచంద్రిక పుస్తకానికి పెందోట పురస్కారం

బాలల కథల పుస్తకానికి అవార్డు

చంద్రికకు ఘన సన్మానం

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోనిలోని ఎన్ఎస్‌సి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థిని చంద్రిక రాసిన కథాచంద్రిక బాలల కథల పుస్తకానికి శ్రీవాణి సాహిత్య పరిషత్తు పెందోట బాలసాహిత్య పీఠం సిద్దిపేట వారు పురస్కారం అందించారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన బాలసాహిత్య సమ్మేళనంలో చంద్రికకి అవార్డుతో పాటు నగదు బహుమతి అందజేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణలో విస్తృతంగా బాల సాహిత్యం వెలువడుతున్న సందర్భంలో చంద్రిక కథల పుస్తకంకి పురస్కారం రావడం ఆనంద దాయకమని బాలసాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు దుర్గా భవాని చంద్రికను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బాల సాహిత్య వేదిక కన్వీనర్, తెలుగు ఉపాధ్యాయులు కోంద్రు బ్రహ్మం , రాధిక గారు, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .



అవార్డు అందుకుంటున్న చంద్రిక

నేడు హైదరాబాద్‌లో పెన్షనర్ల మహాధర్నా

ఎస్టీపీఏటీ అధ్యక్షుడు పరిశపుల్లయ్య

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల చెల్లింపులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా హైదరాబాద్‌లో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఎస్టీపీఏటీ అధ్యక్షుడు పరిశపుల్లయ్య, ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ పేర్కొన్నారు.ధర్నాలో పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఇరవై నెలలుగా రావలసిన బకాయిలు కోసం ఎదురుచూస్తున్నా ఫలితం లేకపోవటంతో పెన్షనర్లు మానసికఆందోళన చెందుతున్నామని చెప్పారు. పెన్షనర్ల సమస్యలపై అధికారులకు విన్నవించామని, మంత్రులను కలిసినా ప్రయోజనం లేదన్నారు. ఇప్పటి కైనా పాలకులుపెన్షనర్ల బకాయిల చెల్లించాలని వారు కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షనర్ల బకాయిల చెల్లింపులు చేయాలన్నారు.



పరిశపుల్లయ్య

ఉమ్మడి జిల్లా టీటీ జట్ల ఎంపికలు పూర్తి

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ఈనెల28 నుంచి 30 వరకు మోయినాబాద్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నీస్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్ల ఎంపికలు ఆదివారం ముగిశాయి. నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రెండురోజుల పాటు జరిగిన ఈ ఎంపికలకు తొలిరోజు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరైనారు. విజేతలకు క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన వివరాలను జిల్లా టేబుల్ టెన్నీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలసాని విజయ్, సెక్రెటరీ కమ్ కోచ్ ఒలేటి సాంబమూర్తి ప్రకటించారు. జట్టులో యశ్వంత్, నేతాజీ, జాయ్‌ఇమ్మాన్యుల్, సర్వజ్ఞరామ్, కారికేయ, బాలసాని లక్ష్మీహార్విక, ఆరాధ్య, రోస్నిత, సాయిశివాని, ప్రవస్య, వంశిక, బాలసాని తన్మయ్‌శ్రీ, ఫైజల్, హరి, హితేష్, తరుణ్, ఉజ్వల్, సాయివర్షిత్, చార్విక్, స్థితప్రజ్ఞ, అభిలాష్, సాయికీర్తన, మోక్షజ్ఞ, సిరి, అమృత, సుప్రియ, జ్వలిత్, మోహిత్‌క్రిష్ణ, రణధీర్‌రెడ్డి, రామ్‌సాకేత్, ఒమేష్, చంద్రిక, షర్మిలరాణి, సౌమ్య, అఖిల, స్నేహిత, సుస్మిత, నవ్య, రష్మి, వర్షిత, సాయిశివ, ధామస్ ఎంపికైనట్లు తెలిపారు.



పోటీల్లో విజేతలు

ఆగని మట్టి అక్రమ రవాణా

» అధికారులు.. రాజకీయ నాయకుల అండ
» చూసీచూడనట్లు వదిలేస్తున్న మైనింగ్ అధికారులు
» రవాణాను ఆపాలంటూ గ్రామస్థుల డిమాండ్



క్వారీ బయట నిలిపిన పొక్లెయిన్, వాహనాలు(ఫైల్), మట్టిని తవ్వుతున్న ప్రభుత్వ భూమి

నేలకొండపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోనిమంద్రాజుపల్లిలోని ప్రభుత్వ భూమిలో మట్టి దందా కొనసాగుతోంది. నెల రోజులుగా కాంట్రాక్టర్ మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నప్పటికీ అధికారులు చూసీ...చూడనట్లు వదిలేస్తుండటం పలుఅనుమానాలకు తావిస్తోంది. ఈనెల13న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు తాత్కాలిక ఉపశమనంగా మట్టి తోలకాలను ఒక్కరోజు ఆపారు. తరువాత రోజునుంచి మళ్లీకొనసాగుతున్నాయి. మంద్రాజుపల్లి నుంచి కోరట్లగూడెం వరకు రోడ్డును వేస్తున్న కాంట్రాక్టర్ మట్టిని తరలిస్తున్నాడు. అంతకుముందు సైతం అక్కడకు సమీపంలోనే వేసినరోడ్డుకు కూడా ప్రభుత్వ భూమి నుంచే మట్టిని తరలించినట్లు ఆరోపణలున్నాయి. మూడుకొత్తడంపర్లుతో, పొక్లెయిన్‌తో మట్టిని తోలాడని గ్రామస్తులు చెపుతున్నారు. మట్టికి ఎటువంటి అనుమతులు లేవని సమాచారం. దీంతో ప్రభుత్వానికి లక్షలో ఆదాయం నష్టం జరిగినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేవు... తహసీల్దార్ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తోలుకోవటానికి ఎటువంటి అనుమతులు లేవని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు స్పష్టం చేసినప్పటికీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మట్టి తోలకాలను వెంటనే ఆపుతామని తహసీల్దార్ చెప్పినప్పటికీ ఆదిశగా చర్యలు లేవు. పెద్ద మొత్తంలో మట్టిని తరలించినట్లు గ్రామస్తులు ఓవైపు చెపుతుండగా, అధికారులకు మాత్రం కనపడటం లేదు. జీపీఓ మట్టి అక్రమంగా తోలే ప్రదేశానికి వెళ్లినప్పటికీ అక్కడ మట్టిని తోలిన ఆనవాళ్లు కనపడలేదనటం విడ్డూరంగా ఉంది.

మైనింగ్ అధికారులకు మట్టి టిప్పర్లు కనపడలేదంట

ఏబీఎన్ రిపోర్టర్ మైనింగ్ ఏడీతో ఫోన్‌లో సంప్రదించగా తాను హెడ్ ఆఫీస్‌లో ఉన్నాని, తన దృష్టికి రాలేదని చెప్పారు. వెంటనే సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటానని చెప్పారు. మైనింగ్ సిబ్బంది నేలకొండపల్లి వచ్చి పవర్ మెక్ ఖాళీ చేసిన ప్రాంతం నుంచి వేస్ట్ మట్టి, రాళ్లతో వెళుతున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. నేలకొండపల్లి పోలీసులకు అప్పగించారు. కానీ మంద్రాజుపల్లిలోని ప్రభుత్వ భూమి నుంచి మాత్రం అక్రమంగా తోలుతున్న టిప్పర్లుకనపక పోవటం ఒకింత ఆశ్చర్యంగా ఉంది మరి.

చర్యలు తీసుకుంటాం మైనింగ్ ఏడీ సాయినాథ్

అక్రమంగా ఎటువంటి అనుమతులు లేకుండా తోలుతున్న మట్టిని ఆపుతామని, చర్యలు తీసుకుంటామని ఏడీ సాయినాథ్ స్పష్టం చేశారు. ఇప్పటికే తోలిన మట్టికి సైతం సెస్సు వసూలు చేస్తామన్నారు. సిబ్బందిని పంపి ఎంతవిస్తీర్ణంలో మట్టిని తోలారో అంచనా వేసి, అందుకు రావాల్సిన సెస్సును బిల్లు నుంచి రాబడతామని ఏబీఎన్‌కు చెప్పారు.



కొత్తగూడెంలో కమ్మ వారి వనసమారాధనలో మంత్రి తుమ్మల



సత్తుపల్లిలో ఆర్యవైశ్య సంఘం వనభోజనాల్లో మంత్రి పొంగులేటి



ఖమ్మంలో కమ్మవారి వనసమారాధనలో మంత్రి తుమ్మల పూజలు



పాటలు పాడుతున్న కళాకారులు



ఖమ్మంలో విశ్వబ్రాహ్మణ సంఘం వనభోజనాల్లో యుగంధర్



పాల్వంచ మండలం కేశవాపురంలో మున్నూరుకాపు వన సమారాధనలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

ఘనంగా కార్తీక వన సమారాధనలు

ఉమ్మడి జిల్లాలో కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఖమ్మంలో కమ్మ, మున్నూరుకాపు, విశ్వబ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో వన భోజనాల కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆటల పోటీలు, కబడ్డీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సత్తుపల్లి, మణుగూరులో ఆర్యవైశ్య సంఘం, భద్రాచలంలో కమ్మ, కొత్తగూడెంలో కమ్మ, రెడ్డి వారి వనసమారాధన, పాల్వంచ, ఏన్కూరులో మున్నూరుకాపు ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.



చిన్నారి భరతనాట్యం



ఏన్కూరులో మున్నూరుకాపు వనభోజనాల్లో మాట్లాడుతున్న రంగారావు



అశ్వారావుపేటలో...



ఖమ్మంలో...



నేలకొండపల్లిలో...

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని పూర్తిచేస్తాం

» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా, నవంబరు16(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి పండుగ నాటికల్లా ఖమ్మం-దేవరపల్లి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని పూర్తిచేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం వైరా మండలంలోని సోమవారం గ్రామసమీపంలో ఉన్న మామిడి తోటలో కమ్మ జన వన సమారాధన కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి మంత్రి తుమ్మల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను తీసుకువచ్చానని అన్నారు. నాగార్జునసాగర్‌లో నీటిలభ్యత లేకపోయినప్పటికీ వైరా రిజర్వాయర్ ద్వారా మధిర నియోజకవర్గాన్ని గోదావరి జలాలతో తడిపే బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పూర్తిఅయితే వైరా నుంచి హైదరాబాద్‌కు రెండున్నర గంటల్లో ప్రయాణించే సౌలభ్యం కలుగుతుందన్నారు. జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వరకు వయా వైరా మీదుగా జాతీయ రహదారిని మంజూరు చేయించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

374 మందికి కారుణ్య నియామక పత్రాల అందజేత

» ఉద్యోగాలు పొందిన వారు సంస్థ అభివృద్ధి కోసం శ్రమించాలి
» సింగరేణి చైర్మన్ బలరాం

కొత్తగూడెం టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా నియామక పత్రాలను సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం ఆదివారం అందజేశారు. సింగరేణిలో ఉద్యోగం పొందిన కార్మికులు సంస్థ అభివృద్ధి కోసం శ్రమించాలని కోరారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా 374 మంది కారుణ్య నియామకాల పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ విధులకు గైర్హాజరు కాకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టం గా భావించాలన్నారు. సింగరేణి డైరెక్టర్ (పా) గౌతం పోట్రూ, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, డైరెక్టర్లు ఎల్వి.సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, గుర్తింపు కార్మికం సంఘం అధ్యక్షడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య కార్మిక సంఘం నాయకులు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ తాగ్యరాజన్, జీఎంలు షాలెం రాజు, జీవి. కిరణ్ కుమార్, ఏజీఎం మురళిధర్‌రావు, ఏఐటీయుసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం టౌన్ : ప్రమాదబీమా అమలులో సింగరేణి యాజమాన్యం భారతదేశానికే మార్గదర్శకంగా మారిందని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తెలిపారు. ఆదివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన కొత్తగూడెం ఏరియాకు చెందిన మహమ్మద్‌అబ్దుల్ నజీమ్ కుటుంబానికి రూ. కోటి చెక్కును అందజేశారు. భట్టు రాజేశ్వరరావు సతీమణికి రూ.40 లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు ఎల్‌వీ. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రూ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ తదితరులున్నారు.



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న దృశ్యం

తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

తేనెటీగల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం కోరారు. ఆదివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో తేనెటీగల సమగ్ర శిక్షణతో తేనెటీగల బాక్సులలో ఉన్న తేనె కిట్లతో సేకరించిన తేనెను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు షాలెం రాజు, జీవీ కిరణ్ కుమార్, మురళీధర్‌రావు, యూనియన్ నాయకులు ఘట్టయ్య, ఎండి. రజాక్, రమణమూర్తి, పితాంబరం, వెంకటాచారి, డీజీఎంలు మోహన్‌రావు, నారాయణరావు, ముకుంద సత్యనారాయణ పాల్గొన్నారు.

రూఫ్‌టాప్ ఆన్‌గ్రిడ్ సోలార్‌తో స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తి

టేకులపల్లి: కాలుష్య కారకాలను తగ్గించి, స్వచ్ఛమైన ఇంధన ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా రూఫ్‌టాప్ ఆన్‌గ్రిడ్ సోలార్ ప్రాజెక్టులను సింగరేణి ఆధ్వర్యంలో చేపడుతున్నామని సింగరేణి సీఅండ్‌ఎండీ బలరాంనాయక్ అన్నారు. ఆదివారం టేకులపల్లిలోని సింగరేణి కాలనీలో 150కిలోవాట్ల రూఫ్‌టాప్ ఆన్‌గ్రిడ్ సోలార్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌర విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల మనం వాడుకొన్న తర్వాత మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్మి సొమ్ముచేసుకొనే ప్రయోజనం కూడా ఉందన్నారు. అనంతరం సీఎండీతో పాటు డైరెక్టర్లు పీపీకే వెంకటేశ్వర్లు, ఎల్‌వీ సూర్యనారాయణలతో కలిసి సోలార్ ప్లాంట్ నిర్మాణం, పనితీరు, ఉత్పత్తి సామర్థ్యం వంటి అంశాలను ప్రత్యేకంగా పరిశీలించి ఇంజనీరింగ్ అధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు జీఎం ఈసం కృష్ణయ్య, కేవోసీ పీవో వేణుగోపాల్, జీఎం ఫైనాన్స్ సుబ్బారావు, ఎస్‌ఓటూ జీఎం డి.రామస్వామి, ఏరియా ఇంజనీర్ నర్సింహారాజు, డీజీఎం(పర్సనల్) అజ్మీర తుకారాం, డీజీఎం(సివిల్) రవికుమార్, డీజీఎం(ఈఈడి)ప్రభాకర్, డీజీఎం(వర్క్‌షాప్)నాగరాజు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆకర్షణీయమైన ప్రకటనలతో
సైబర్ మోసాలు: సీపీ

ఖమ్మంక్రైం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): సైబర్‌మోసగాళ్లు నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెబుతూ పెట్టుబడిదారులను ఆకర్షించి మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త కంపనీ లేదా ప్రసిద్ధి సంస్థ పేరుమీద ఐపీవో వస్తుందొంటూ తక్కువ ధరలో షేర్లు అందుబాటులో ఉన్నాయంటూ త్వరగా షేర్లు తీసుకుంటే ఎక్కువ లాభం వస్తుందంటూ వాట్సాప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఈమెయిల్ ద్వారా లింక్‌పంపుతూ మోసపూరిత వాగ్దానాలతో చేసి డబ్బు బదిలీ చేయించుకుని మోసం చేశారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని సీపీ తెలిపారు. మోసగాళ్లవద్ద కంపెనీ ఐపీవో వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్‌సైట్‌లు సృష్టిస్తారని, ఆలింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ అకౌంట్ వివరాలు ఆధార్, పాన్, యూపీఐ ద్వారా చెల్లింపులు చేయమని చెబుతారన్నారు. కొన్నిసార్లు నకిలీ షేర్ సర్టిఫికెట్లు లేదా రశీదులు కూడా పంపి మోసం చేస్తారని తెలిపారు. అలా పెట్టుబడి పెట్టే ముందు సెబీ లేదా ఎన్‌ఎస్‌ఈ/బీఎస్‌ఈ అధికారిక వెబ్‌సైట్లలో ఆ కంపెనీ నిజంగా ఐపీవో నమోదు అయిందో లేదో ధృవీకరించుకోవాలని తెలిపారు. ఏవరైనా వీడియో కాల్, వాట్సాప్ లేదా మెసేజ్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్‌కట్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

సమాజ చైతన్యానికి కవులు, రచయితల పాత్ర కీలకం

» అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ఖమ్మం కార్పొరేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో మార్పు, చైతన్యానికి కవులు, కళాకారులు, రచయితల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని ఆధునిక సమాజంలోను రచయితలు, కవుల సామాజిక సమస్యలు, ప్రజా సమస్యలను ఎలుగెత్తి చూపేలా స్పందించాలని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు కోరారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఖమ్మం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలంతో పాటుగా అభ్యుదయ సాహిత్య అవసరం పెరిగిందన్నారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటమైన, తెలంగాణ సాయుధ పోరాటమైనా ఇలా ఏ పోరాటంలో నైనా కవులు, రచయితలు, కళాకారుల పాత్ర కీలకంగా ఉందన్నారు. సాహిత్యం ద్వారా ప్రజలు జాగృతి అవుతారని వివరించారు. పాటలు అనేక ఉద్యమాలకు ప్రేరణగా నిలిచాయన్నారు. ప్రజల్ని మేల్కొపే పాటలు, కథలు, కవితలు, వీధి నాటకాలు మరింతగా వెలువడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం కాలంలో బడియాదడిరి అలపించిన బండెనక బండి కట్టి పదహారు బండు కట్టి ఏ బండ్లో వస్తావు కోడకో నైజాం సరార్కడో అన్నా పాట యావత్ తెలంగాణ ప్రజల్ని ఉద్యమానానికి కార్యోన్ముఖులను చేసిందని కేవీఎల్ వివరించారు. అధునిక యుగంలో డిజిటల్ వ్యవస్థపై నేటి తరం ఆధారపడిన పాటకు ప్రజా సాహిత్యానికి పదును తగ్గలేదన్నారు.

ప్రజా సాహిత్యం విరివిగా వెలువడితే అందుకు అనుగుణంగా కళారూపాలు పుట్టుకొస్తాయన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేవీఎల్ కోరారు. సీపీఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల్లో డిసెంబరు 26న ఖమ్మంలో జరగనునున్న సందర్భంగా అభ్యుదయ రచయితలు సంఘం సామాజిక రాజకీయ, ఆర్థిక అంశాలు నేటి పరిస్థితులపై అభ్యుదయ రచియతల నుంచి రచనలను ఆహ్వానిస్తుందని కోరారు. చైతన్య గుమ్మంగా వామపక్ష ఉద్యమ పురిటిగడ్డగా పేరొందిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కవులు సాహిత్య వేత్తలు, సమకాలీన పరిస్థితులపైన స్పందించి రచనలు చేయాలని ఆ రచనలు పుస్తక రూపంలో తీసుకొస్తామన్నారు. ఈ మేరకు అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వ ర్యంలో అనేక సెమినార్లు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెర్ల వీరస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి, కన్నెకంటి వెంకట య్య, నిధి కాంతేశ్వరరావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, ఆంజనేయులు, భారతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

గిరిజన లంబాడీ సంఘాల జిల్లా
జేఏసీ చైర్మన్‌గా లక్ష్మణ్‌నాయక్



లక్ష్మణ్ నాయక్‌ను అభినందిస్తున్న జేఏసీ సభ్యులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): గిరిజన లంబాడీ సంఘాల జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్‌ను ఆదివారం నియమించారు. కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ ఏర్పాటు చేయగా నూతన చైర్మన్‌గా ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ జీవో నెంబర్ 3 సాధన కోసం, విద్యా, ఉద్యోగ, రాజకీయలలో జిల్లా గిరిజన జనాభా ప్రతిపాధికన గిరిజనులకు ప్రత్యేకంగా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో బంజారా భవన్ నిర్మాణం, సేవాలాల్ మందిర నిర్మాణానికి మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని అన్నారు. భద్రాచలం ఆలయ కమిటీ చైర్మన్ గిరిజనులకు కేటాయించాలని, పాల్వంచ పెద్దమ్మతల్లి దేవాలయం చైర్మన్ స్థానిక గిరిజనులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు రమేష్‌నాయక్, ప్రసాద్‌నాయక్, శంకర్ నాయక్, డి.సురేష్‌నాయక్, భట్టు జుంకీలాల్, మూడ్ బాలాజీ నాయక్, వెంకటేశ్వర్లు, లావూరి శ్రీనివాస్, భద్రంగినాయక్, మోహన్‌నాయక్, భూక్యా రవిరాథోడ్, బాలాజీ నాయక్ తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కళాశాల హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

నూజివీడు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కళాశాల హాస్టల్‌లో ఒక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పట్వారిగూడేనికి చెందిన చందన్ కుమార్ (19) ఏలూరు జిల్లా నూజివీడులోని ఓ ప్రైవేటు కళాశాలలో కామర్స్ డిగ్రీ విద్యను అభ్యసిస్తున్నాడు. తాను చదువుతున్న కళాశాల హాస్టల్లో శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం వచ్చిన సిబ్బంది చందన్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్న విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

విలేఖరిపై కేసు నమోదు

పాల్వంచ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వార్తలు రాయకుండా ఉండాలంటే డబ్బులు ముట్టచెప్పాల్సిందేనని ఒక ఫంక్షన్‌హాల్ యజమానిని బెదిరించిన ఓ విలేఖరిపై పాల్వంచ టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాల్వంచ మండల పరిధిలోని సోములగూడెం గ్రామపంచాయతీలో నల్లా సురేష్‌రెడ్డి అనే వ్యక్తి కన్వెన్షన్ హాల్ నిర్మించాడు. సదరు కన్వెన్షన్ హాల్‌కి అనుమతులు లేవని ఆరోపిస్తూ ఓ దినపత్రిక జిల్లా స్టాఫర్ జి.నరసింహరావు పలు దఫాలుగా వార్తలు రాశాడు. అనంతరం మరలా రాయకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని కన్వెన్షన్ హాల్ యజమానిని బెదిరించాడు. దీంతో కన్వెన్షన్ హాల్ యజమానికి, విలేఖరికి నగదు విషయంతో ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే కొంత నగదును ఫంక్షన్‌హాల్ యజమాని సదరు విలేఖరికి ముట్టచెప్పాడు. అయినప్పటికీ మరలా అదే రీతిలో వార్తలు రాస్తానని బెదిరించడంతో సదరు ఫంక్షన్‌హాల్ యజమాని పోలీసులను ఆశ్రయించాడు. సదరు విలేఖరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

ఖమ్మం క్రైం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని శ్రీరామ్‌హిల్స్‌లో నివసించే ఓ వ్యాపారి పుల్లఖండం నాగేంద్రరావు ఆదివారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లోని హోం థియేటర్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. కొద్దిసేపటి తర్వాత గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఇంటి నుంచి బయటకు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన సంఘటనా స్థలానికి చేరుకొని స్మోక్ ఎగ్జాస్టర్ అనే ఆధునిక యం త్రంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చి నట్లు అగ్నిమాపక అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

చెరువులో పడి కాపలాదారుడి మృతి

» రామానగరంలో ఘటన

సత్తుపల్లిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి కాపలాదారుడు మృతి చెందిన సంఘటన ఆదివారం సత్తుపల్లి మండలం రామానగరంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పిల్లి ఆనందరావు(36) గ్రామంలోని బేతుపల్లి పెద్ద చెరువు సొసైటీ సభ్యుడిగా ఉంటూ, చెరువుకు కాపలా ఉంటున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం భోజనానంతరం బహిర్భూమికి అని చెరువు కట్ట వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» ఐదుగురిపై కేసు నమోదు

కారేపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సూర్యా తండా శివారులో పేకాట స్థావరంపై పోలీసులు అదివారం దాడి చేశారు. సూర్యా తండా సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో ఎస్ఐ బైరు గోపి సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.23,500 నగదు, మూడు సెల్‌ఫోన్లు, ద్వి చక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతున్నవారిలో ఇద్దరు పరారు కాగా, ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. దాడిలో పోలీసు సిబ్బంది ఓంకార్, వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

● వ్యక్తికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలోని సాయిబాబా ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. ఏపీలోని గంపలగూడెం మండలం పెనుగోలను గ్రామానికి చెందిన వేల్పుల నాగరాజు, అతని భార్య కలసి ద్విచక్ర వాహనంపై జూలూరుపాడు నుంచి ఏన్కూరు వైపు వెళుతున్నారు. ఈక్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న లారీ సాయిబాబా ఆలయ సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ సంఘటనలో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 వాహనంలో జూలూరుపాడులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో అతి వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు.

భూ భారతి దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్

కామేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కామేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదివారం పరిశీలించారు.ఈసందర్భంగా రెవెన్యూ సిబ్బంది భూభారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను గ్రామపాలన అధికారుల పరిశీలిస్తుండగా తనిఖీ చేశారు. దరఖాస్తులపై పలుసలహాలు, సూచనలు ఇచ్చారు. పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర్, డీటీ రవీ, ఆర్ఐలు విజయభాస్కర్, విజయ పాల్గొన్నారు.

వనమంతా జనం..

(5వ పేజీ తరువాయి)

వారిని ఆకట్టుకున్నాయి. ఆలయ సెట్టింగ్‌లో శివుడు, ఎన్టీఆర్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా శివలింగానికి పూజలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిమిక్రీకళాకారుడు జాలారపు రమేష్ చేసిన ప్రదర్శన ఆహ్లాదాన్ని పంచింది. అలాగే పలు క్రీడాపోటీలు నిర్వహించగా కబడ్డీలో రావూరి ఈవెంట్స్ జట్టు ప్రథమ స్థానం, ప్రకాష్ ప్రాజెక్టు ద్వితీయ స్థానం పొందాయి.

అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసిన మహనీయుడు ఎన్టీఆర్ : తుమ్మల

కృషి, నిబద్ధత, పట్టుదల వల్లే అన్ని రంగాల్లో గుర్తింపు పొందుతున్నారని, కమ్మ కులంతోపాటు అన్ని కులాలకు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కమ్మ మహాజన సంఘం వనసమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కమ్మ వారు ఎక్కడున్నా ఆయారంగాల్లో శ్రమించి పనిచేసి ముందడుగు వేయాలని జాతిగౌరవం, విశిష్టతనుపెంచాలని ఆకాంక్షించారు. వ్యవసాయాన్ని పునాది చేసుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరిచిన వర్గం కమ్మవారేనని గుర్తుచేశారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అంటూ పేదలకోసం అనేక సంక్షేమథకాలు ప్రవేశపెట్టిన ఆద్యుడు, జాతిగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని శ్లాఘించారు. తన 45 ఏళ్లరాజకీయ జీవితంలో ఏప్రభుత్వంలో అవకాశం వచ్చినా జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి, అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేశానన్నారు. ఏకులంలోని పేదపిల్లలైనా వారి చదువుల కోసం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ వ్యవసాయం నుంచి ఐటీ వరకు ప్రతి రంగంలో కమ్మవారి ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ వనసమారాధన కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము, పాలకవర్గ ప్రతినిధులు కర్నాటి రమాదేవి, వజ్జా శ్రీనివాసరావు, తుళ్లూరి నిర్మలకుమారి, మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, రావూరి సైదుబాబు, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వర్‌రావు, తాళ్లూరి మురళీకృష్ణ, గుంటుపల్లి శ్రీనివాస్, కోలేటి నవీన్, బండి రవికుమార్ తదితరులతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలు చల్లగా ఉండాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజల దీవెనలతో గెలిచిన తాను ఎప్పుడూ ఎక్కడా తలదించుకోనివ్వకుండా వ్యవహరించానని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సత్తుపల్లి మండలం గౌరిగూడెంలో నిర్వహించిన రెడ్డి వనసమారాధన, వాణీ గురుకులంలో నిర్వహించిన సత్తుపల్లి ఆర్యవైశ్య వనసమారాధన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల ప్రజలు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. రెడ్డి వనసమారాధనలో ఆయన మాట్లాడుతూ అందరినీ సఖ్యత చేసుకుని, అందరినీ కలుపుకుని మెప్పుపొందేవాడే రెడ్డి అని అన్నారు. అందరూ గౌరవంగా, గర్వంగా చెప్పుకునేలా తన ప్రవర్తన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మందపాటి ముత్తారెడ్డి, గంగ్ర సోమిరెడ్డి, మందపాటి రవీంద్‌రెడ్డి, పద్మజ్యోతి, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, కొండపల్లి రమేష్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, గొర్లమారి రామ్మోహనరెడ్డి, కొప్పుల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్యుల సమారాధనలో మాట్లాడిన ఆయన ఆడబిడ్డలు వంటింటికే పరిమితం కాకుండా ప్రశాంతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలని, అందుకు ఇలాంటి వనసమారాధనలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల గాంధీ, వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో...

ఖమ్మం రామన్నపేట ఊరి చివర మామిడితోటలో విశ్వబ్రాహ్మణుల వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువ కాంగ్రెస్ నేత తుమ్మల యుగంధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులంతా ఐక్యంగా ఉండి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనను విశ్వబ్రాహ్మణులు ఘనంగా సత్కరించారు. ఈ వనసమారాధనకు విశ్వబ్రాహ్మణులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో బచ్చుల పద్మాచారి, దెంచనాల రామాచారి, కొత్తూరు రామాచారి, కేసోజు వీరాచారి, వెగ్గళం పాండురంగాచారి, అలవాల నాగేశ్వరరావు, చిట్టోజు రమేష్, మండలోజు వాసుదేవాచారి, తాటికొండ రవీంద్రాచారి, చెన్నోజు పుల్లయ్య తదితరులు హాజరయ్యారు.



విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన పూజలో పాల్గొన్న భక్తులు

నేలకొండపల్లిలో ఘనంగా కమ్మ వనసమారాధన



నేలకొండపల్లి: కమ్మవారి కార్తీక వనసమారాధన ఆదివారం నేలకొండపల్లిలోని అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడి తోటలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝామున మహిళలు తోటలోని ఉసిరి చెట్టుకు శాస్త్రయుక్తంగా పూజలు చేశారు. చిన్నారులు, మహిళలు ఆటా,పాటలతో సందడి చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. తోటలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఫోటో ఎగ్జిబిషన్ ఆకర్షణీయంగా నిలిచింది. కార్తీక వన సమారాధనకు సహకరించిన, విజయవంతం చేసిన కమ్మ సోదర,సోదరీమణులకు నిర్వాహక కమిటీ సభ్యులు చవళం ప్రవీణ్‌కుమార్, మద్దినేని మహేష్, అక్కినేని నాగేశ్వరరావు, కడియాల నగేష్ ధన్యవాదాలు తెలిపారు.



రక్తదానం ప్రాణదానంతో సమానం

కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్



కామేపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ముచ్చర్లలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మీరిచ్చే రక్తదానం ఆపదలో ఉన్న వారికి ఎంతో బాసటగా నిలుస్తుందన్నారు. తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు, గర్భిణీలకు ఉపయోగపడుతుందన్నారు. గ్రామంలో సుమారు 35మంది యువకులు రక్తాన్ని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చల్లా తిరుమల్‌రావు, కొండ నాగరాజు, చల్లా సాయికుమార్, మల్లెంపాటి శ్రీనివాసరావు, కోలాల లక్ష్మీనారాయణ, వేముల వెంకటనారాయణ, రాయల వీరన్న పాల్గొన్నారు.

పుస్తకాలకు మించిన స్నేహితులు లేరు

జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కరుణ కుమారి



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రంథాలయ సిబ్బంది

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుస్తకాలకు మించిన స్నేహితులు లేరని పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కే.కరుణకుమారి అన్నారు.ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వజాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. మూడోరోజు పుస్తక పఠనం గురించి ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కోకానీ, మంచి పుస్తకం కొనుక్కో అనే నినాదాలతో గ్రంథాలయం నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయ కార్యదర్శి కే.కరుణ కుమారి మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయంలో చదివిన ఎంతో మంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని అన్నారు. వారోత్సవాలలో గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేవీఎస్ఎల్ ఎన్.రాజు సెక్రటరీ ఇమామ్ ప్రత్యేక అతిథులు ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల లైబ్రరియన్ పగిడికత్తుల విజయకుమార్, తెలుగుఅసోసియేట్ ప్రొఫెసర్ నిర్మలకుమారి, ఉమెన్స్ కాలేజీ లైబ్రరియన్ మల్లేశం కామర్స్‌అసోసియేట్ ప్రొఫెసర్ ఏఆర్ సత్యవతి గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు జె.భాస్కర్,ఎస్. లలిత కుమారి, సుమలత, విజయ కుమారి, నాగలక్ష్మి,రవిబాబు,సీహెచ్‌శ్రీనివాస్‌పాల్గొన్నారు.

ముగిసిన 'చాంబర్' ఎన్నికలు

- అధ్యక్షుడిగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్
- ప్రధాన కార్యదర్శిగా సోమా నర్సింహరావు(జీవై నరేష్)
- దిగుమతి శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా వడ్డె వెంకటేశ్వర్లు, ఎర్రా అప్పారావు
- మిర్చిశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా మెంతుల శ్రీశైలం, యడ్లపల్లి సతీష్
- ట్రెజరర్‌గా తల్లాడ రమేష్‌ను మరో సారి వరించిన విజయం





బారులు తీరిన ఓటర్లు, ఓటేస్తున్న వ్యాపారి

ఖమ్మంమార్కెట్ , నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 'చాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సోమా నర్సింహరావు(జీవై నరేష్) విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం నువ్వా, నేనా అన్నట్లు ఉత్కంఠగా కొనసాగింది. కొందరు అభ్యర్థులు కేవలం ఒకటి, రెండు ఓట్ల తేడాతో విజయం సాధించడం గమనార్హం. ప్రధాన పదవులకు రెండు కురువెళ్ల, మేళ్లచెరువు ప్యానల్‌లు పోటీ పడ్డాయి. ఒక ప్యానల్‌నుంచి ఒక్కొక్కరు చొప్పున విజయం సాధించడం విశేషం. చాంబర్‌ఆఫ్ కామర్స్‌లో 18శాఖలకు గాను మొత్తం 1305 ఓట్లకు గాను 1289 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక అంతిమంగా ప్రధాన పదవులైన అధ్యక్ష పదవికి కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ తన సమీప ప్రత్యర్థి మేళ్ళచెర్వు వెంకటేశ్వరరావుపై 219ఓట్ల తేడాతో గెలుపొందగా ప్రధాన కార్యదర్శి ఎన్నికలో జీవై నరేష్ తన సమీప ప్రత్యర్థి గుడవర్తి శ్రీనివాసరావుపై 20ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి కురువెళ్ళ లక్ష్మీకాంతరావుపై 67 ఓట్ల తేడాతో బత్తిని నర్సింహారావు విజయం సాధించారు. సహాయ కార్యదర్శి పదవికి బాదె రవి తన సమీప ప్రత్యర్థి ముత్యం ఉప్పల్‌రావుపై విజయం సాధించగా కోశాధికారిగా తల్లాడ రమేష్ తన సమీప ప్రత్యర్థి తూములూరి లక్ష్మీనర్సింహరావుపై 20ఓట్లతో గెలుపొంది రెండో సారి ట్రెజరర్‌గా ఎన్నికైయ్యారు. వ్యవసాయ మార్కెట్‌లో కీలకమైన దిగుమతి శాఖ అధ్యక్షుడిగా వడ్డె వెంకటేశ్వర్లు తన సమీప ప్రత్యర్థి కోలేటి నవీన్‌కుమార్ విజయం సాధించారు. కార్యదర్శిగా యర్రా అప్పారావు తన సమీప ప్రత్యర్థి సోమారపు సుధీర్‌కుమార్‌పై కేవలం రెండు ఓట్ల తేడాతో గెలుపొందారు. మిర్చి శాఖ అధ్యక్షుడిగా, మెంతుల శ్రీశైలం తన సమీప ప్రత్యర్థి బండారు వీరబాబుపై, కార్యదర్శిగా యడ్లపల్లి సతీష్, చింతల రామలింగేశ్వరరావుపై, ఎగుమతి శాఖ అధ్యక్షుడిగా నల్లమల ఆనంద్, మన్నెం క్రిష్ణపై గెలుపొందగా కార్యదర్శిగా బైరిశెట్టి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. వెండి బంగారం శాఖ అధ్యక్షుడిగా బందు సూర్యం సమీప ప్రత్యర్థి విజయగిరి సదానందచారిపై, సెక్రెటరీ పదవికి నకిరకంటి సతీష్ తన సమీప ప్రత్యర్థి బూర్లె లక్ష్మీనారాయణపై కేవలం ఒక ఓటు తేడాతో, సామిల్ శాఖ అధ్యక్షుడిగా దాస మల్లిఖార్జున్ తన సమీప ప్రత్యర్థి నర్సయ్యగౌడ్‌పై గెలుపొందారు. అంతే కాకుండా కోల్డ్‌స్టోరేజీ శాఖ, దాల్‌మిల్, ఆయిల్‌మిల్, క్లాత్ అండ్ రెడీమేడ్, కిరాణం, కోలేటి నవీన్‌కుమార్, డిస్ట్రిబ్యూటర్స్, జనరల్ మనియార్, ఇనుము, క్యాన్వాసింగ్, అగ్రికల్చర్ మోటర్స్, కలప, సిమెంట్, ధాన్యం శాఖలు అధ్యక్ష, కార్యదరిశ పదవులతో పాటు పలు శాఖల ఈసీ మెంబర్ల పదవులు ఏకగ్రీవయ్యాయి.



అధ్యక్షుడిగా ఎన్నికైన కురువెళ్ల ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా సోమా నర్సింహరావు



ఎర్ర అప్పారావు,యడ్లపల్లి యడ్లపల్లి సతీష్,మెంతుల శ్రీశైలం



తల్లాడ రమేష్, వడ్డె వెంకటేశ్వర్లు, నల్లమల ఆనంద్

పరిష్కారం దిశగా ప్రజావాణి

కేఎంసీలో గతనెల 21నుంచి 200 వినతుల పరిష్కారం

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలో ప్రజలు ఇచ్చే వినతులు, సమస్యలు పరిష్కారం దిశగా మారుతున్నాయి. నగరప్రజలు ఎంతో సమయం కేటాయించి ప్రతీ సోమవారం కేఎంసీలో కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్వహించే ప్రజావాణిలో సమస్యలు తెలియజేస్తూ వినతులు అందిస్తున్నారు. అయితే వాటిని గతంలో ఆన్‌లైన్ నమోదు చేయక పోవటంతో 90శాతం మేరకు వినతులు పరిష్కారం కాలేదు. గత నెల నుంచి ప్రతీవినతిని ఆన్‌లైన్ నమోదు చేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలు జారీ చేయటంతో ప్రజావాణి వినతులు పరిష్కారం దిశగా మారుతున్నాయి. దీంతో ఒకే సమస్యపై పదేపదే వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రజావాణిలో కొత్తసమస్యలు ఉన్న వారు మాత్రమే వస్తున్నారు. ఫలితంగా రోజువారి వినతులు సంఖ్య తగ్గింది.

ప్రతీ వినతి ఆన్‌లైన్ నమోదు

ప్రజావాణిలో వచ్చే ప్రతీ వినతిని అక్కడే నేరుగా ఆన్‌లైన్ నమోదు చేసే విధంగా కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్యచరణ చేశారు. ప్రజావాణి విభాగంలోనే కంప్యూటర్ ఆపరేటర్లను ఉంచి దరఖాస్తులను నమోదు చేయించారు. ఇలా 250 వరకు దరఖాస్తులు పెండింగ్‌లోకి రావటంతో అక్టోబరు 21న ప్రత్యేకంగా డ్రైవ్ చేపట్టారు. పట్టణ ప్రణాళిక విభాగంలో 58 వరకు వినతులు అందాయి. వాటిలో ఎక్కువ అక్రమ కట్టడాలు, రహదారులు నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయి. క్రమపద్ధతిలో నోటీసులు జారీ చేసి 68 వినతులు పరిష్కారం చేశారు. పారిశుధ్యంలో 45 వినతులు అందాయి. డ్రైనేజీలు శుభ్రం చేయాలని, ఇంటి చుట్టూ చెత్త కుప్పలు ఉన్నాయని దరఖాస్తులు అందాయి. వాటిని డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఫిర్యాదుల వారీగా డివిజన్లు వారిగా పరిష్కరించారు. రెవెన్యూలో 64వినతులు అందాయి. వాటిలో కొన్ని వినతులు క్షేత్రస్థాయిలో పరిశీలనల కోసం మిగిలాయి. ఇంజనీరింగ్ విభాగంలో 73వినతులు వచ్చాయి. కొత్త డ్రైయినేజీలు, సీసీ రహదారులు నిర్మాణం కోరుతున్నారు. ఆర్థిక పరమైన అంశాలు కావటంతో మంజూరు జరగని పెండింగ్‌లో ఉన్నాయి. కాగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సమస్యల పరిష్కారంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఓ గిరిజన మహిళ ఆరు నెలలుగా కేఎంసీ చుట్టూ తన ఇద్దరు ఆడ పిల్లల్ని వెంటబెట్టుకొని తిరుగుతున్నారు. కలెక్టర్ కార్యాలయం, గృహనిర్మాణశాఖ, కేఎంసీ మధ్య సమన్వయం లేక పోవటంతో ఆ ఇందిరమ్మ లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మొత్తం 250వినతుల్లో 200వరకు పరిష్కారం జరిగాయి. మరో 50 వినతులు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

శిశువుల ఆరోగ్యంపై అవగాహన అవసరం

'ప్రీమెచ్యూరిటీ డే' పై అంకుర, ఆయు ఆధ్వర్యంలో 5కే రన్



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంకలెక్టరేట్,నవంబరు16(ఆంధ్రజ్యోతి): అకాల శిశువు(ప్రీమెచ్యూర్ బేబీ)లకు సంబంధించి ఆరోగ్య పరంగా ఏర్పడిన సమస్యలపై అవగాహన అవసరమని 'అంకుర' ఆసుపత్రి వైద్యులు చల్లగుళ్ల రాకేష్, శ్రీనిధి అన్నారు. ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 5కేరన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సదస్సులో వారు మాట్లాడుతూ తల్లికి డయాబెటిస్, అధిక మానసిక ఒత్తిడి, గర్భాశయంలో ఇన్ఫెక్షన్లు వంటి ఎన్నో కారణాలు ఉంటాయనీ, కొన్నిసార్లు కవలలు పుట్టే సందర్భంలోనూ ప్రీమెచ్యూరిటీ సంభవించే అవకాశాలు ఉంటాయన్నారు. అలాంటి సమయంలో శిశువుల పట్ల ప్రారంభ దశలోనే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చిన్నారుల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. శరీరఉష్ణోగ్రత, నిద్ర, పోషకాహారం, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సుమారు 400 మందికి పైగా 5కేరన్‌లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో టీవీయాంకర్ రవి,అంకుర ఆసుపత్రి స్త్రీపిల్లల వైద్యనిపుణులు, సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పీడియాట్రిక్స్, అంకుర ఆసుపత్రి సిబ్బంది నాగళ్ల అన్వేష్, మట్టా రమేష్, కందిమళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

మిషన్లు.. మొరాయిస్తున్నాయి!

(5వ పేజీ తరువాయి)

దోహదపడడంతో పాటు రోగికి అవసరమైన చికిత్సలను అందించేందుకు కృషిచేస్తున్నారు.

తరచూ అంతరాయాలు..

ఐదేళ్ల పరిమితి దాటడం.. అనలైజర్ మిషన్లపై లోడ్ పడడంతో అవి తరచుగా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. తొలుత రీఏజెంట్లు సరఫరా కాకపోవడంతో వారం పదిరోజుల పాటు మూలన పడ్డాయి. కానీ తాజాగా మిషన్లు మొరాయిస్తున్నాయి. రక్తనమూనాలు పెరిగిపోతుండడంతో మధ్యలోనే మిషన్లు ఆగిపోతున్నాయి. ప్రతి రెండురోజులకోసారి సాంకేతిక అంతరాయాలు టీహబ్‌లో తలెత్తుతుండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి సంబంధించిన టెక్నీషియన్లు హైదరాబాద్ నుంచి వచ్చి మరమ్మతులు చేపట్టాలంటే ఆర్థిక భారంతో పాటు తీవ్ర జాప్యమవుతోంది. ఫలితంగా రోగనిర్ధారణ పరీక్షలు నిలిచిపోయి చికిత్సలకు తీరని అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వం ఏ లక్ష్యంతో ఏర్పాటు చేసిందో అ లక్ష్యం నీరుగారిపోతోంది. ఇప్పటికైనా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో టీహబ్‌లో పాత వాటి స్థానంలో కొత్త అనలైజింగ్ మిషన్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

టీహబ్ పరిస్థితిపై నివేదించాం, ఎం.నరేందర్, జీజీహెచ్ సూపరింటెండెంట్

టీహబ్‌లో తరచుగా అంతరాయాలు ఏర్పడుతున్నట్లు గుర్తించాం. టెక్నీషియన్లు కూడా ఇదే మాట చెప్పారు. దీనిపై టీఎస్ఎంఐడీసీ అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. సుమారు కోటిన్నర నిధులతో వీటిని మళ్లీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంపించిన ప్రతిపాదనలపై పర్యవేక్షిస్తాం. ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకెళ్లానున్నాం.



రిపోర్టులను సిద్ధం చేస్తున్న నిపుణులు

ఆయిల్‌పామ్ సబ్సిడీలను సద్వినియోగం చేసుకోండి

- ఎఫ్‌పీవోలు పంటలపై రైతులకు అవగాహన కలిగించాలి
- జిల్లా సహకార అధికారి గంగాధర్



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి గంగాధర్

నేలకొండపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పీఓలు) రైతులకు పంటలపై అవగాహన కలిగించాలని,ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి గంగాధర్ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండ్రాజుపల్లి రైతు వేదికలో జరిగిన సహకార వారోత్సవాల్లో గంగాధర్ పాల్గొన్నారు. బోదులబండ సొసైటీ అధ్యక్షుడు అనంతు కాశయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీసీఓ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంత రైతులను బలోపేతం చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సహకార సంఘాలు బలంగా ఉన్నప్పుడే గ్రామీణ అభివృద్ధి సాధ్యమన్నారు.

ఆయిల్‌ఫామ్ సాగుతో అధిక లాభాలు హార్టికల్చర్ అధికారి అపర్ణ

రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని హార్టీకల్చర్ అధికారి అపర్ణ రైతులను కోరారు. పంట మార్పిడి విధానం వలన భూమి యెక్క సారం మెరుగవుతుందన్నారు. రైతులు ఆయిల్‌ఫామ్ పంట సాగుపై దృష్టి సారించాలని అపర్ణ కోరారు. పంట దిగుబడి ప్రారంభమైన అనంతరం దాదాపు 20 సంవత్సరాల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఈ సమావేశంలో సొసైటీల అధ్యక్షుడు అనంతు కాశయ్య, పూర్ణచందర్‌రావు, బోదులబండ, మండ్రాజుపల్లి కార్యదర్శులు వరగాని జగదీష్, సౌజన్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్, ఇన్స్‌పెక్టర్ రవి, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనసమారాధనలు

ఏన్కూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస సందర్భంగా ఏన్కూరులో కమ్మ వారి కార్తీకవనమహోత్సవం ఆదివారం మాదినేని బాబు మామిడితోటలో ఉత్సాహ ంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, బీజేపీ నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు, మున్నూరుకాపు సంఘం నాయకులు కనకం జనార్ధన్, కనిశెట్టి నరసయ్య, కాసిన్ని శ్రీనివాసరావు, ఆవుల నరసయ్య, తోట రామచంద్రయ్య, పిన్ని వెంకటనారాయణ,పేలప్రోలు వరశంకరప్రసాద్, ముదిగొండ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరులో ఆదివారం మండల కమ్మసేవ సంఘం ఆధ్వర్యంలో అహ్లాదంగా(రజత్సోవ)వన మహోత్సవం జరిగింది. స్థానికంగా చంద్రుపట్ల రహదారి వైపున గల రమణయ్య మామిడి తోటలో ఏర్పాటుచేసిన మహోత్సవంలో మహిళలు ఆట పాట సందడితో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా కమ్మ సంఘం కల్లూరు మండల గౌరవ అధ్యక్షుడు రాధకృష్ణమూర్తిని ప్రముఖులు కట్టా అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, జాస్తి శ్రీనివాసరావులు శాలువలతో సత్కరించారు. మద్దినేని శ్రీనివాసరావు, బొప్పన రామారావు, మట్టూరి జనార్ధన్‌రావు, వెంకటయ్య, చల్లగొళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైరా: వైరాలో ఆదివారం కమ్మజనసేవా సమితి ఆధ్వర్యంలో కార్తీకమాస వనసమారాధన ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు వన సమారాధానలో ప్రత్యేక పూజలు చేశారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, బిజేపి జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, టీజీవో జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జునరావు, సూర్యదేవర శ్రీధర్, శ్రీరామనేని రామస్వామి, చింతనిప్పు రాంబాబు, చెరుకూరి కిరణ్, బండి కృష్ణప్రసాద్, జాలాది రామకృష్ణ, జనార్ధన్, వాసిరెడ్డి రమేష్, కొల్లి రమేష్, కర్నాటి హనుమంతరావు, ఏనుగు హనుమంతరావు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో ఆదివారం మున్నూరుకాపు వనసమారాధణ కార్యక్రమం సందడిగా సాగింది. స్థానిక గుంటుపల్లి శ్యాంప్రసాద్ మా మిడితోటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వన దేవతలకు పూజలు చేశారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

మధిరరూరల్: కార్తీక వన సమారాధన కార్యక్రమాలను పలు సామాజిక వర్గాల ఆధ్వర్యంలో వేర్వేరుగా మధిర శివారు ప్రాంతంలో గల అత్కూరు మామిడి తోటలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.


ఏన్కూరులో శివున్ని పూజిస్తున్న తుమ్మల


వైరాలో గౌడ సంఘం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం


మధిరలో నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం


సత్తుపల్లిలో రాజాను సన్మానిస్తున్న దృశ్యం


వైరాలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల


తల్లాడలో బహుమతులిస్తున్న దృశ్యం


కల్లూరులో కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం


మహిళలు ఆటపాట ఆడుతున్న దృశ్యం

వనమంతా జనం..

(5వ పేజీ తరువాయి)

వారిని ఆకట్టుకున్నాయి. ఆలయ సెట్టింగ్‌లో శివుడు, ఎన్టీఆర్ విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా శివలింగానికి పూజలు చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిమిక్రీకళాకారుడు జాలారపు రమేష్ చేసిన ప్రదర్శన ఆహ్లాదాన్ని పంచింది. అలాగే పలు క్రీడాపోటీలు నిర్వహించగా కబడ్డీలో రావూరి ఈవెంట్స్ జట్టు ప్రథమ స్థానం, ప్రకాష్ ప్రాజెక్టు ద్వితీయ స్థానం పొందాయి.

అభివృద్ధి, సంక్షేమానికి బాటలు వేసిన మహనీయుడు ఎన్టీఆర్ : తుమ్మల

కృషి, నిబద్ధత, పట్టుదల వల్లే అన్ని రంగాల్లో గుర్తింపు పొందుతున్నారని, కమ్మ కులంతో పాటు అన్ని కులాలకు సహాయ సహకారాలు అందిస్తూ ముందుకు సాగాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం కమ్మ మహాజన సంఘం వనసమారాధన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కమ్మ వారు ఎక్కడున్నా ఆయారంగాల్లో శ్రమించి పనిచేసి ముందడుగు వేయాలని జాతి గౌరవం, విశిష్టతనుపెంచాలని ఆకాంక్షించారు. వ్యవసాయాన్ని పునాది చేసుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరిచిన వర్గం కమ్మవారేనని గుర్తుచేశారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అంటూ పేదలకోసం అనేక సంక్షేమథకాలు ప్రవేశపెట్టిన అద్యుడు, జాతిగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు ఎన్టీఆర్ అని శ్లాఘించారు. తన 45 ఏళ్లరాజకీయ జీవితంలో ఏప్రభుత్వంలో అవకాశం వచ్చినా జిల్లా, రాష్ట్ర అభివృద్ధికి, అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేశానన్నారు. ఏకులంలోని పేదపిల్లలైనా వారి చదువుల కోసం సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ వ్యవసాయం నుంచి ఐటీ వరకు ప్రతి రంగంలో కమ్మవారి ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ వనసమారాధన కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొల్లు రఘు సత్యనారాయణ, చావా రాము, పాలకవర్గ ప్రతినిధులు కర్ణాటి రమాదేవి, వజ్జా శ్రీనివాసరావు, తుళ్లూరి నిర్మలకుమారి, మోతుకూరి సత్యనారాయణ, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మేదరమెట్ల స్వరూపరాణి, రావూరి సైదుబాబు, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వర్‌రావు, తాళ్లూరి మురళీకృష్ణ, గుంటుపల్లి శ్రీనివాస్, కోలేటి నవీన్, బండి రవికుమార్ తదితరులతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాల ప్రజలు చల్లగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజల దీవెనలతో గెలిచిన తాను ఎప్పుడూ ఎక్కడా తలదించుకోనివ్వకుండా వ్యవహరించానని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్తీక మాసం సందర్భంగా ఆదివారం సత్తుపల్లి మండలం గౌరిగూడెంలో నిర్వహించిన రెడ్డి వనసమారాధన, వాణీ గురుకులంలో నిర్వహించిన సత్తుపల్లి ఆర్యవైశ్య వనసమారాధన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగురాష్ట్రాల ప్రజలు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. రెడ్డి వనసమారాధనలో ఆయన మాట్లాడుతూ అందరినీ సఖ్యత చేసుకుని, అందరినీ కలుపుకుని మెప్పు పొందేవాడే రెడ్డి అని అన్నారు. అందరూ గౌరవంగా, గర్వంగా చెప్పుకునేలా తన ప్రవర్తన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మందపాటి ముత్తారెడ్డి, గంగ్ర సోమిరెడ్డి, మందపాటి రవీంద్‌రెడ్డి, పద్మజ్యోతి, గాదిరెడ్డి సుబ్బారెడ్డి, కొండపల్లి రమేష్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సతీష్‌కుమార్‌రెడ్డి, గోలి శ్రీనివాసరెడ్డి, గొర్లమారి రామ్మోహనరెడ్డి, కొప్పుల నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆర్యవైశ్యుల సమారాధనలో మాట్లాడిన ఆయన ఆడబిడ్డలు వంటింటికే పరిమితం కాకుండా ప్రశాంతంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపాలని, అందుకు ఇలాంటి వనసమారాధనలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమెట్ల గాంధీ, వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మిషన్లు.. మొరాయిస్తున్నాయి!

(5వ పేజీ తరువాయి)

దోహదపడడంతో పాటు రోగికి అవసరమైన చికిత్సలను అందించేందుకు వైద్యులు కృషిచేస్తున్నారు.

తరచూ అంతరాయాలు..

ఐదేళ్ల పరిమితి దాటడం.. అనలైజర్ మిషన్లపై లోడ్ పడడంతో అవి తరచుగా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. తొలుత రీఏజెంట్లు సరఫరా కాకపోవడంతో వారం పదిరోజుల పాటు మూలన పడ్డాయి. కానీ తాజాగా మిషన్లు మొరాయిస్తున్నాయి. రక్తనమూనాలు పెరిగిపోతుండడంతో మధ్యలోనే మిషన్లు ఆగిపోతున్నాయి. ప్రతి రెండురోజులకోసారి సాంకేతిక అంతరాయాలు టీహబ్‌లో తలెత్తుతుండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. దీనికి సంబంధించిన టెక్నీషియన్లు హైదరాబాద్ నుంచి వచ్చి మరమ్మతులు చేపట్టాలంటే ఆర్థిక భారంతో పాటు తీవ్ర జాప్యమవుతోంది.


ఫుల్లీ ఆటోమేటిక్ హెమటాలజీ అనలైజింగ్ మిషన్


ఆటోమేటిక్ బయో కెమిస్ట్ అనలైజింగ్ మిషన్ ఇదే

ఫలితంగా రోగనిర్ధారణ పరీక్షలు నిలిచిపోయి చికిత్సలకు తీరని అంతరాయం ఏర్పడుతోంది. ప్రభుత్వం ఏ లక్ష్యంతో ఏర్పాటు చేసిందో అ లక్ష్యం నీరుగారిపోతోంది. ఇప్పటికైనా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో టీహబ్‌లో పాత వాటి స్థానంలో కొత్త అనలైజింగ్ మిషన్లు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

టీహబ్ పరిస్థితిపై నివేదించాం,
డాక్టర్ ఎం.నరేందర్, జీజీహెచ్ సూపరింటెండెంట్

టీహబ్‌లో తరచుగా అంతరాయాలు ఏర్పడుతున్నట్టు గుర్తించాం. టెక్నీషియన్లు కూడా ఇదే మాట చెప్పారు. దీనిపై టీఎస్‌ఎంఐడీసీ అధికారులకు, ప్రభుత్వానికి నివేదికలను పంపించాం. సుమారు కోటిన్నర నిధులతో వీటిని మళ్లీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పంపించిన ప్రతిపాదనలపై పర్యవేక్షిస్తాం. ప్రభుత్వం దృష్టికి మరోమారు తీసుకెళ్లానున్నాం.

ఎర్ర రిబ్బన్ల సూచికలు.. అయోమయంలో రైతులు

» దారిపొడవునా ఏర్పాటు చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



చింతకాని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం లచ్చగూడెం, రాఘవాపురం గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ భూముల్లో ఏర్పాటు చేసిన సూచికలతో సంబంధిత భూముల రైతులు అయోమాయానికి గురవుతున్నారు. ఎరుపు రంగు రిబ్బన్లపై ఎల్1000/380 వరుస క్రమంలో నెంబరలను పొడగిస్తూ సుమారు కిలో మీటరు దూరం వరకు ఎరుపు రిబ్బన్లను రైతుల పొలాల్లో సూచికలుగా ఏర్పాటు చేశారు. ఇప్పటికే చింతకాని మండలంలో రెండు జాతీయ రహదారులు సూర్యాపేట- దేవరపల్లి, నాగపూర్- అమరావతి రహదారి నిర్మాణ పనులకు వందల ఎకరాల్లో రైతులు భూములు కోల్పోయి మనోవేధనలో ఉన్నారు. ఇప్పుడు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కొత్తగా సూచికలు ఏర్పాటు చేయడంతో ఇంకేదో కొత్త జాతీయ ప్రాజెక్టు వస్తుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చింతకాని మండలం రామకృష్ణాపురం నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకు కొత్త రైల్వే లైన్ ఏర్పాటు జరుగుతుందని గత నెల రోజుల నుంచి మండల వ్యాప్తంగా పుకార్లు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన సూచికలు రైల్వే లైన్‌కు సంబంధించినవేమోనని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయంపై చింతకాని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్‌ను వివరణ కొరగా తమకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

కారేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్ కార్యాలయాన్ని అదివారం రాత్రి జిల్లా అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనువాస్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరుగుతన్న సాద బైనమా, రెవిన్యూ సదస్సులకు సంబంధించిన ఫైళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ ఉ.రమేష్, డీప్యూటి తహసీల్ధార్ కృష్ణయ్య, ఆర్ఐ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


తహసీల్ధార్ కార్యాలయంలో ఫైల్స్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

కారేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులకు మండల కాంగ్రెస్ నాయకులు మెదరి టోని అదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సహకారంతో మండల కేంద్రంలో రూ.రెండున్నర కోట్ల వ్యయంతో సీసీ రోడ్డు మంజూరు అయిన్నట్లు తెలిపారు. మంజూరైన రోడ్లను సకాలంలో పూర్తిచేయాలని, నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్ననాయకులు

వృద్ధాశ్రమంలో అన్నదానం

బోనకల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక దివ్యదయాళ్ వృద్ధాశ్రమంలో ఆదివారం 2005-06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అన్నదానం చేశారు. తమ స్నేహితులు జె. స్వప్న, ఎస్‌కె. ఖాదర్‌బాబుల జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించనట్లు పూర్వ విద్యార్థులు వరుగు గోపిచంద్, చేబ్రోలు నాగరాజు, చింతల శ్రీను, బారతిలు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

టీఎస్ యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కొణిజర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా అమ్మపాలెం గ్రామానికి చెందిన చిలుకూరి వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా మాదాల ప్రసాదరావు, మండల ఉపాధ్యక్షుడుగా రత్న సుశీల శ్రీనివాసరావు, కోశాధికారిగా ఖాదర్, కార్యదర్శులుగా రమణ, కనకవల్లి, పుల్లారావు, మోహిద్దీన్, దశరథ్, బాల యేసు క్రాంతికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసమావేశంలో జిల్లా అధ్యక్షుడు రంజాన్ వైరా మండల ట్రెజరర్ హనుమంతరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

సీతంపేట గ్రామ రెవెన్యూ సహాయకుడు కన్నుమూత

చింతకాని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామ రెవెన్యూ సహాయకుడు(వీఆర్ఏ) షేక్ మీరా సాహెబ్ (70) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. సందర్భంగా మృతదేహాన్ని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. దహనసంస్కారాల నిమిత్తం ప్రభుత్వం తరఫున రూ 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఏకవీర, జీపీవో షేక్ లాల్‌జాన్ పాషా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉన్ని దుస్తులకు పెరిగిన గిరాకీ

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలో గడచిన మూడు రోజుల నుంచి చలి తీవ్రత విపరితంగా పెరిగింది. రాత్రి సమయంలో 7 గంటల నుంచి మరుసటి ఉదయం 8 గంటల వరకు చలి పులి వణికిస్తోంది. ఆ సమయంలో బయటకు రావాలంటే ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. రుతుపవనాలు తిరోగమనంతో ఇలాంటి పరిస్థితులు ఉంటాయని వారతవరణ శాఖ హెచ్చరిస్తోంది. చలి కాలం కారణంగా కల్లూరు పట్టణ వాసులతో పాటుగా పల్లె గ్రామాల ప్రజలు ఉన్ని దుస్తులు కొనుగోలు చేసేందుకు ఆశక్తి చూపుతున్నారు. మండల పరిధిలోని కల్లూరు మునిసిపాలిటీతో పాటుగా కిష్టయ్యబంజర, ఖాన్‌ఖాన్‌పేటతో పాటుగా చెన్నూరు, లింగాల, పెద్దకోరుకొండి, ముచ్చవరం, తదితర గ్రామాల్లోని ప్రజలు సాయింత్రం వేళల్లో తవ అవసరాల కోసం వచ్చి త్వరగా పనులు ముగించుకొని కల్లూరు సెంటర్ నుంచి రాత్రి 8 గంటలకే తమ నివాసాలకు చేరుకుంటున్నారు. ప్రధాన రహదారులన్ని ఆ సమయం లోగానే నిర్మానుషంగా మారుతున్నాయి. జన సంచారం రద్ది పూర్తిగా తగ్గిపోతుంది. ఇక చలి తీవ్రంగా ఉంటంటంతో శరీరం వెచ్చదనం ఉండేలా ఉన్ని దుస్తుల కేంద్రాలకు వచ్చి వాటిని కొనుగోలు చేయటంతో డిమాండు బాగా పెరిగిందని చెప్పవచ్చు. ఇప్పటికే ఉన్ని దుస్తుల అమ్మక కేంద్రాలను ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, రాష్ట్రాల నుంచి వ్యాపారులు దుకాణాలను తెరిచారు. ఈ సమయంలో స్వెట్టర్లు, మంకీ క్యాపులు, తదితర ఉన్ని దుస్తులకు గిరాకి పెరిగింది. ఇక బీపీ, షుగర్‌వ్యాధి గ్రస్తులు మరంత జగ్రత్త పడుతూ రాత్రిపూట సమయంలో తమ గృహాల నుంచి బయటకు రావాలంటే గజగజ వణుకుతు బయటకు రావాలంటే భయాందోళనగా ఉందని చెప్తున్నారు.


కల్లూరులో ఉన్ని దుస్తులు కొనుగోలు చేస్తున్న పట్టణ వాసులు

'శ్రీ ఆదర్శ' విద్యార్థుల వనసమారాధన

చింతకాని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీ ఆదర్శ పాఠశాలల విద్యార్థుల ఆదివారం వనసమరాధన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా గ్రామ సమీపంలోని మామిడి తోటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులందరూ పాల్గొన్నారు. ఆటపాటలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజ్‌మెంట్ కిరణ్‌కుమార్, చావా అరుణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక చేయూత

వైరా నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైరా మున్సిపాలిటి పరిధిలోని 14 వార్డులో శాంతినగర్‌కు చెందిన ఆదూరి ప్రేమ్ కుమార్ తనయుడు ఆదూరి జస్విన్ కుమార్‌కు వికారాబాద్‌లోని మహావీరు మెడికల్ కాలేజీలో ఫ్రీ ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఈ నేపథ్యంలో విద్యార్థి చదువు ఖర్చులు నిమిత్తం ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ రూ.15వేలు ఆర్థిక సహాయం స్థానిక ఎస్ఐ పి.రామారవు చేతుల మీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధాయుడు గుడిపాటి సూర్యం, బెజవాడ వీరభద్రనావు, ఆదురి ప్రేమ్ కుమార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

సోషలిస్టు మార్గంలోనే సమస్యల పరిష్కారం

కొణిజర్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోషలిస్టు మార్గంలోనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. ఆదివారం మండలంలోని మంగాపురం గ్రామంలో ఓ ఫంక్షన్‌హాల్ నిర్వహించిన కమ్యూనిస్టు యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశంలో లౌకికవాదం అమలు జరగాలని అప్పుడే విద్యా, వైద్యంతోపాటు ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. రైతులకు రుణమాఫీ చేయలేని బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 11 ఏళ్లకాలంలో కార్పొరేట్ సంస్థలకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేశారని ఆరోపించారు. దేశంలో ఉన్న సమస్యలపై చర్చలు చేయకుండా మతం పేరుతో యువతను పక్కదోవపట్టిస్తోందని ఆవేదన చెందారు. ఉరికొయ్యలను ముద్దాడిన భగత్‌సింగ్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలనలి కోరారు మైక్రోఫైనాన్స్ బారినపడి అనేకమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారని తెలిపారు. యువతకు భవిష్యత్ లేకుండా పోయిందన్నారు. సోషలిస్టు వ్యవస్థ మాత్రమే కష్టాలనుంచి బయటపడేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బండారు రమేష్, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం , ఏఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగుల్ పాషా, మోటుపల్లి మధు, జిల్లా నాయకులు షేక్ అఫ్జల్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు తాల్లపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు పాల్గొన్నారు.


సమ్మేళనంలో మాట్లాడుతున్న పోతినేని

లోకల్ బాడీ ఎన్నికలకు సిద్ధమవ్వండి

» రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

సత్తుపల్లిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జూబ్లీ హిల్స్ ఎన్నికలలో విజయం.. అందరి ఆశీర్వాదంతో సాధ్యమైందని, లోకల్ బాడీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలను ఉద్దేశ్యించి రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం సత్తుపల్లి మునిసిపాలిటీలోని వెంగళరావు నగర్, వాణీ విద్యాలయం వీధులలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు షేక్ సత్తాబీ, పాండే సత్యవతి, ఈశ్వరరావు, కొవ్వూరు వెంకటేశ్వరరావు, విజయలక్ష్మిలను ఆప్యాయంగా పలకరిస్తూ బిల్లులు వచ్చాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, గాదె చెన్నారావు, దూదిపాల రాంబాబు తదితరులున్నారు.


వెంగళరావు నగర్‌లో ఇంటిని ప్రారంభిస్తున్న మంత్రి

పత్తి కూలీల కొరత..

» పొలంలోనే ఎండిపోతున్న పత్తి
» నష్టపోతున్న రైతులు


కూలీలు దొరకక పొలంలోనే ఎండిపోతున్న పత్తి

కారేపల్లి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి వేలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేసిన రైతులకు పంటచేతికి వచ్చే సమయంలో కూలీల కొరత వేధిస్తోంది. కూలీలు దొరకకపోవడంతో పత్తి పంట రైతుల కళ్ళముందే ఎండిపోతుండడంతో మనోవేధనకు గురవతున్నారు. మండలంలో ఇటివల వచ్చిన భారీ వర్షాలతో పత్తిపంట రైతులు కొంతమేర నష్టపోయారు. ప్రస్తుతం వర్షాలు తగ్గి ఎండలు కాస్తుండగా పంటచేతికి వచ్చే సమయంలో కూలీల కొరత ఏర్పడింది. దీంతో రైతులు దిక్కు తోచనిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఒకవేళ కూలీలలు దొరికిన కూలీ పెద్దం మొత్తంలో అడుగుతున్నారని, కిలోపత్తికి రూ.25, 30 రూపాయల వరకు అడుగుతున్నారని, తీసిన పత్తి వచ్చిన కూలీల ఖర్చులకే సరిపొంతుందని రైతులు పెర్కొంటున్నారు. పత్తితీసే సమయంలోనే వరి కోతలు వచ్చాయి. దీంతో కొంతమంది కూలీలు పత్తి తీతలకు రాకుండా, వరి కోతలకు వెళ్ళుతుండడంతో మరింత కూలీల కొరత ఏర్పడింది.

మూడెకరాలకు లక్ష ఖర్చు

రైతు కొండలరావు



తాను సాగు చేసిన మూడెకరాల పత్తిపంట కోసం లక్ష రూపాయల వరకు ఖర్చు అయిందని, పత్తి 8 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందని రైతు దుగ్గినిపుడి కొండలరావు అన్నారు. పత్తి పంటసాగుకోసం అనేక కష్టాలు పడాల్సి వచ్చిందని, పత్తి చేతికి వచ్చే సమయంలో దొరికిన కూలీలతో తీసి కాటపెడితే కేవలం 8 క్వింటాలు మాత్రమే వచ్చి ందని, దీంతో తీవ్రంగా నష్టపోయిన్నట్లు కొండలరావు తెలిపారు. పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.